aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
15-07-2026 సంపుటి : 01 సంచిక :113 పేజీలు : 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## సీఎం టార్గెట్ సిద్దిపేట!

- ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బలమైన నేతలకు బాధ్యతలు
- ఓ వైపు మైనంపల్లి.. మరోవైపు జగ్గారెడ్డి.. స్పెషల్ ఫోకస్
- వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్
- గజ్వేల్ స్థానంపై రేవంత్ నజర్... అక్కడి నుంచే పోటీ చేయాలన్న యోచన
- బీఆర్ఎస్ బలంగా ఉన్న జిల్లాలపై అధికార పార్టీ వ్యూహాత్మక ప్రణాళిక
- పార్టీల బలాబలాలపై జిల్లాల వారీగా అంతర్గత సర్వే

**హైదరాబాద్,జూలై 14( మహాప్రభ**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే అంతర్గత కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రధాన ప్రతిపక్షంలో బలమైన నాయకుల స్థానాలకు ఎసరు పెట్టేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపబోతున్నారు. ప్రస్తుతానికి రేవంత్ టార్గెట్ 'సిద్దిపేట'గా నిర్ణయించుకుని ఆ మేరకు గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నారు. అందుకోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు బలమైన నేతలకు బాధ్యతలు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ఓ వైపు మైనంపల్లి.. మరోవైపు జగ్గారెడ్డికి అక్కడి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చాలాకాలం పాటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగానే కాకుండా దాదాపు రెండు దశాబ్దాల కాలంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్థానిక సుపరిచిత నేతగా మైనంపల్లి హనుమంతరావు రాజకీయాల్లో

-మిగతా 3లో



## అమ్మాయిల పెండ్లి వయసు 21కి పెంపు?

- కేంద్రం మరోసారి కసరత్తు
- 2027 జనాభా లెక్కల తర్వాతే తుది నిర్ణయానికి అవకాశం
- 23.1 ఏళ్లకు పెరిగిన మహిళల సగటు వివాహ వయసు
- పట్టణాల్లో 24.4.. గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏళ్లకు పెళ్లిళ్లు
- ఉన్నత విద్య, ఉపాధితో ఆలస్యమవుతున్న వివాహాలు
- ఆలస్య వివాహాలతో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు
- తల్లి ఆరోగ్యం, జనాభా, ఉపాధి విధానాలపై కొత్త ఆలోచనలు

3 లో

### అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను
# నిర్మించండి


**ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ సదుపాయాలు కల్పించాలి**


- కాకతీయ వైభవాన్ని ప్రతిబింబించేలా వరంగల్ ఎయిర్‌పోర్టు
- 2028 జూన్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి
- రెండు విమానాశ్రయాల్లో విమాన శిక్షణ కేంద్రాలకు ప్రతిపాదన
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు భూసేకరణ చేపడతాం: సీఎం
- హుస్సేన్‌సాగర్--ప్రకాశం బ్యారేజీ మధ్య సీ ప్లేన్‌ల ప్రతిపాదన
- అభివృద్ధికి రాజకీయాలకు సంబంధం లేదు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ జూలై 14( మహాప్రభ**

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ఈ రెండు విమానాశ్రయాలకు ఉన్న సానుకూల అవకాశాలు, పరిస్థితులను సీఎం వివరించారు. మంగళవారం ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో రాజీవ్ గాంధీ భవన్‌లో రామ్మోహన్ నాయుడుతో సీఎం.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా

-మిగతా 3లో



## పీవోకేలో రక్తసిక్తం..

- పాక్ రేంజర్ల కాల్పుల్లో 8 మంది నిరసనకారుల మృతి
- తీవ్రంగా ఖండించిన భారత్
- ముజఫరాబాద్ ర్యాలీకి ముందు రావల్‌కోట్‌లో కాల్పుల కలకలం
- మహిళలు, ఆందోళనకారులపై భద్రతా బలగాల దాడి
- పీవోకేలో మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆగ్రహం
- దశాబ్దాలుగా అణచివేతకు పాల్పడుతోందని ఇస్లామాబాద్‌పై ఆరోపణ

3 లో

## 60 రోజులపాటు యుద్ధం?

- కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక నోటీసు



3లో



## వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలి

- హోర్ముజ్ లో దాడులపై భారత్ సీరియస్
- పశ్చిమాసియాలో మళ్లీ ముదురుతున్న యుద్ధం
- హోర్ముజ్ లో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మరణం

**న్యూఢిల్లీ జూలై 14( మహాప్రభ**

హోర్ముజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే ఈ అధికారిక ప్రకటన వెలువడింది.

-మిగతా 3లో




### పాఠశాలలు, కళాశాలల్లో
## లైంగిక విద్యకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- సుప్రీంకోర్టుకు ప్రభుత్వ నిర్ణయం వెల్లడి
- 'సేఫ్ టచ్--అన్‌సేఫ్ టచ్'పై చిన్నారులకు అవగాహన
- పాఠ్యాంశాల్లో లైంగిక ఆరోగ్యం, భద్రతకు చోటు
- జాతీయ నిపుణుల కమిటీ కీలక సిఫార్సులకు ఆమోదం
- పోక్సో కేసుల నేపథ్యంలో సంస్కరణలపై దృష్టి
- వయస్సుకు తగిన లైంగిక విద్య బోధనకు కార్యాచరణ

**న్యూఢిల్లీ,జూలై 14( మహాప్రభ**

దేశంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 'సమగ్ర లైంగిక విద్య' ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిందని, కోర్టు అనుమతి లభించిన వెంటనే అమలు ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్రం వెల్లడించింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ముందు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ విషయాన్ని వెల్లడించారు. కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం అంగీకరించిందని, దేశవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

-మిగతా 3లో

### పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు
# పూర్తి చేస్తాం

**ఇందిరమ్మ పాలనలో సంక్షేమం, అభివృద్ధి**

- గృహజ్యోతితో అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలమూరు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలే ప్రభుత్వ లక్ష్యం
- రైతు భరోసా నిధులు ఇప్పటికే ఖాతాల్లో జమ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- తెల్ల రేషన్ కార్డు కుటుంబాలకు రూ.5 లక్షల ఉచిత బీమా
- విద్యార్థులకు అల్పాహారం.. వడ్లకు బోనస్‌తో రైతుకు అండ
- సంక్షేమం--అభివృద్ధే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ఎజెండా
- గద్వాలలో రూ.376.25 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులకు శ్రీకారం

**జోగులాంబ గద్వాల జూలై 14( మహాప్రభ**

పాలమూరు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన డిప్యూటీ సీఎంకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్ కు చేరుకున్న భట్టి జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక,

-మిగతా 3లో





## షేక్ హసీనా ఢాకాకు తిరిగి వస్తే జైలుకే

- షేక్ హసీనా ఢాకాకు తిరిగి రావడంపై స్పందించిన బంగ్లాదేశ్ మంత్రి
- స్వదేశానికి తిరిగొస్తే చట్టప్రకారమే చర్యలు తీసుకుంటాం
- హసీనాపై న్యాయ ప్రక్రియ కొనసాగుతుందన్న ఢాకా
- అవామీ లీగ్‌కు ధైర్యం చెప్పేందుకే హసీనా వ్యాఖ్యలు?
- అప్పగింత కోసం భారత్‌కు మరోసారి ఢాకా విజ్ఞప్తి

**ఢాకా:**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఢాకాకు తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆమె తిరిగి రావడంపై బంగ్లాదేశ్ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. షేక్ హసీనా తిరిగి బంగ్లాదేశ్ కు వస్తే చట్ట ప్రకారం అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి శామా ఒబైద్ ఇస్లాం స్పష్టం చేశారు. హసీనా ఎక్కడ లొంగిపోయినా, బంగ్లాదేశ్ లో అడుగుపెట్టిన వెంటనే చట్టపరమైన ప్రక్రియ అమలవుతుందని పేర్కొన్నారు. హసీనా లొంగిపోతే ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు తీసుకుంటామని శామా ఒబైద్ తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని అన్నారు. ఆమె ఇప్పటికే కోర్టుల్లో దోషిగా తేలిన వ్యక్తి, అందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరమే లేదన్నారు. భారత్ లో లేదా బంగ్లాదేశ్ లో లొంగిపోయినా ముందుగా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. హసీనా బంగ్లాదేశ్ కు తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన ప్రక్రియ ఏ విధంగా ముందుకు సాగాలనే అంశాన్ని న్యాయవ్యవస్థ నిర్ణయిస్తుందని మంత్రి చెప్పారు.

-మిగతా 3లో



## 20న క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- దశలవారీగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబాటు
- తొలి దశలో నియోజకవర్గానికి 500--1,000 ఇళ్లు
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- పరిపాలన అనుమతులకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్
- త్వరలో దరఖాస్తులు, అర్హతలు, మార్గదర్శకాల ప్రకటన
- స్థలాల గుర్తింపు పూర్తి.. డిజైన్లకు తుది మెరుగులు
- పట్టణ పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ జూలై 14( మహాప్రభ**

గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లతో పెద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ పరిధిలో మరో చారిత్రాత్మక అడుగు వేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనున్నట్టు అన్నారు. ఇందుకు

-మిగతా 3లో

# హాఫీజ్ సయీద్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ పై జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పెహల్గామ్ ఉగ్రదాడితో లింకున్న కేసులో కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. జూలై 8వ తేదీన ఎన్ఐఏ కోర్టు ప్రత్యేక జడ్జీ ఆ ఆదేశాలు జారీ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో హాఫీజ్ సయీద్‌పై ఎన్ఐఏ నేరాభియోగం నమోదు చేసిన తర్వాత కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. భారత్, అమెరికా దేశాలు హాఫీజ్ సయీద్‌ను గ్లోబల్ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తతెలిసిందే. 2008 ముంబై ఉగ్రదాడి కేసులో మాస్టర్‌మైండ్ కూడా.76 ఏళ్ల సయీద్‌పై సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. భారతీయ న్యాయ సంహితో పాటు యూఏపీఏ సెక్షన్ల కింద అతనిపై కేసు బుక్ చేశారు.పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో ఉన్న సరోగ్ధాలో సయీద్ ఉంటున్నట్లు ఎన్ఐఏ కోర్టుకు చెప్పింది. పెహల్గామ్ ఉగ్రదాడి నిందితుడైన హాఫీజ్.. ప్రస్తుతం అరెస్టు నుంచి తప్పించుకున్నట్లు కోర్టు పేర్కొన్నది. హాఫీజ్ అరెస్టు కోసం నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎన్ఐఏ.. ఎట్టి పరిస్థితుల్లో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో నిష్పాక్షిత దర్యాప్తు కోసం సయీద్‌ను కస్టడీలోకి తీసుకోవాలని ఎన్ఐఏ పేర్కొన్నది. నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ ఆదేశాలను జమ్మూ డీఐజీకి పంపినట్లు ఎన్ఐఏ కోర్టు తెలిపింది. 2025 ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

## పశ్చిమ బెంగాల్‌లో పడవ మునిగి 9 మంది మత్స్యకారుల మృతి..



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్‌లోని సుందర్బన్ పరిధిలో బంగాళాఖాతంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల పడవ జూలై 4న మునిగిపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పు మిడ్నాపూర్ జిల్లా దిఘా హార్బర్ నుంచి జూలై 2న 15 మందితో బయలుదేరిన ఈ బోటు.. ప్రతికూల వాతావరణం, అలల ఉధృతి కారణంగా బక్కాలి కోస్ట్ వద్ద మునిగిపోయింది. రెస్క్యూ బృందాల గాలింపులో ఒడిశా, బెంగాల్‌కు చెందిన 9 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో ఆరుగురి కోసం రెస్క్యూ బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి.


## బంగ్లాదేశ్‌లో వరద బీభత్సం.. 54 మంది మృతి



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
బంగ్లాదేశ్‌ను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి విపత్తు కారణంగా ఇప్పటివరకు 54 మంది ప్రాణాలు కోల్పోగా, ఖగ్రాచారి, రంగమతి సహా పలు జిల్లాల్లో సుమారు ఆరు లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అనేక ప్రాంతాలు జలమయం కాగా, కొండచరియలు విరిగిపడటంతో రవాణా, జనజీవనం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయ చర్యలు ముమ్మరం చేశాయి. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందిస్తోంది.

## కేంద్రం మొద్దుబారిపోయింది

**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**



కేంద్ర ప్రభుత్వం మొద్దుబారిపోయిందని, ఏ త్యాగాన్ని గుర్తించలేకపోతోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. జంతర్‌మంతర్‌లో 17 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, పర్యావరణంపై వాంగ్‌చుక్ చూపుతున్న నిబద్ధత గొప్పదని కొనియాడుతూ, ఆయన వెంటనే దీక్ష విరమించాలని అఖిలేష్ కోరారు. మరోవైపు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ చేస్తున్న ఆందోళన 24వ రోజుకు చేరుకుంది. ఈ నిరసనకు మద్దతు తెలుపుతున్న ఆప్ నేత కేజ్రీవాల్ మాట్లాడుతూ, వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తోందని, నిరసనను కొనసాగించేందుకు ఇతర మార్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 5 గంటలకు తాను జంతర్‌మంతర్‌కు వెళ్లి వాంగ్‌చుక్‌కు సంఘీభావం తెలపనున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు.

# భారత రైతాంగానికి తీపికబురు..

**-పారాక్వాట్‌ను నిషేధించిన ప్రభుత్వం..!**



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
భారత రైతాంగం పాలిట విషతుల్యంగా మారిన పారాక్వాట్ గడ్డిమందుపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఎందరో రైతుల ప్రాణాలను బలిగొన్న ఈ హానికరమైన రసాయనం అమ్మకాలు నిలిపివేస్తూ మంగళవారం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే 70కి పైగా దేశాల్లో పారాక్వాట్‌ను నిషేధించగా మనదేశంలో మాత్రం ఈ గడ్డిమందు అమ్మకాలు యథేచ్ఛగా సాగాయి. అయితే.. ఇటీవల కాలంలో ఈ రసాయనం దుష్పరిణామాలపై తీవ్ర స్థాయిలో ఆందోళనలు.. వైద్యులు, వ్యవసాయ నిపుణుల అభ్యర్థించడంతో దిగొచ్చిన కేంద్రం ఎట్టకేలకు పారాక్వాట్‌ను నిషేధం విధించింది.(ప్రాణాంతకమైన పారాక్వాట్(పారక్వాట్ డైక్లోరైడ్)పై కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. హానికరమైన ఈ గడ్డిమందు అమ్మకాలను నిలిపివేస్తున్నట్టు మంగళవారం వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. పారాక్వాట్ వినియోగంపై ఈ రోజు నుంచే (జూలై 14) దేశ వ్యాప్తంగా నిషేధం అమలులోకి వస్తుందని కేంద్రం వెల్లడించింది.
కీటకనాశన చట్టం 1968, సెక్షన్ 27 ప్రకారం పారాక్వాట్ దిగుమతి, తయారీ, రవాణా, పంపిణీపై పూర్తి స్థాయిలో నిషేధం వర్తిస్తుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. అదే సమయంలో.. సదరు కంపెనీకి అభ్యంతరాలు, సూచనలు తెలియజేయడానికి 30 రోజుల సమయం ఇచ్చింది. జూలై 13 నుంచి ఆగస్టు 13లోపు పారాక్వాట్ ఉత్పత్తి సంస్థ తమ స్పందన తెలియజేయాల్సి ఉంది.

**6 వేలమందికి పైగా**
గడ్డి మందుగా వాడకంలో ఉన్న పారాక్వాట్ ప్రాణాలు బలిగొంటుందని పలువురు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఈ గడ్డిమందు కారణంగా దేశవ్యాప్తంగా 6 వేలమందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని రికార్డులు చెబుతున్నాయి. టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ ఈ మందు కారణంగానే తన సోదరుడు ప్రాణాలు కోల్పోయాడని, తక్షణమే దీన్ని బ్యాన్ చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. అలానే.. ది మైఖేల్ జె.ఫాక్స్ ఫౌండేషన్ సైతం.. ఈ హానికర రసాయనానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసింది. వీరితో పాటు వైద్యులు, వ్యవసాయ నిపుణులు సైతం నిషేధానికి పట్టుబట్టారు. దాంతో, పారాక్వాట్‌పై నిషేధానికి సంబంధించిన ఫైలుపై కేంద్ర వ్యవసాయ మంత్రి సంతకం చేశారని కిసాన్ టాక్ కథనం వెల్లడించింది.

# మూడు లక్షలకు చేరువలో అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య..



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
పవిత్ర అమర్‌నాథ్ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధలతో విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే దర్శించుకున్న భక్తుల సంఖ్య 2.75 లక్షలు దాటి మూడు లక్షలకు చేరువైంది. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఇవాళ అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉంది.మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్‌కు బయలుదేరింది. వీరిలో 3,599 మంది పహల్గామ్ బేస్ క్యాంపునకు, 1,736 మంది బల్తాల్ బేస్ క్యాంపునకు వెళ్తున్నారు. సోమవారం ఒక్కరోజే 24,259 మంది యాత్రికులు దర్శనం చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాగా ఈ యాత్రలో సోమవారం ఒక చిన్న రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. Accidents & Disasters రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ సమీపంలో యాత్రికుల బస్సు బ్రేకులు విఫలం కావడంతో మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో 18 మంది యాత్రికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి, ప్రత్యామ్నాయ వాహనంలో ప్రయాణాన్ని కొనసాగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మినహా యాత్ర ప్రశాంతంగా సాగుతోంది. జూలై 3న ప్రారంభమైన ఈ 57 రోజుల సుదీర్ఘ యాత్ర శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినమైన ఆగస్టు 28న ముగియనుంది. యాత్ర సురక్షితంగా సాగేందుకు సీఆర్పీఎఫ్, ఆర్మీ, స్థానిక పోలీసులతో సహా భద్రతా బలగాలు సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన ఏర్పాట్లు చేశాయి.

# పగబట్టిన ఏనుగు దాడిలో నలుగురు దుర్మరణం..!

**పద్నాలుగేళ్ల క్రితం తల్లిదండ్రులు.. ఇప్పుడు కోడలు, మనవడు..**



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
ఏనుగు పగబట్టి ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పగబట్టి వెంటాడింది. ఈ క్రమంలో 14 ఏళ్ల క్రితమే ఇద్దరిని చంపేసింది. దాంతో భయపడిన ఆ కుటుంబం ఊరి వదిలిపోయి వేరే ఊళ్లో మకాం పెట్టింది. అయినా ఆ కుటుంబాన్ని పసిగట్టి మరో ఇద్దరిని చంపేసింది. దాంతో ఆ ఏనుగు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లు అయ్యింది. ఈ హృదయవిదారక ఘటన నేపాల్ లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్ సమీపంలో నివసించే శనిచర బోటే కుటుంబానికి 'ధ్రుబే' అనే ఏనుగు రూపంలో మృత్యువు వేటాడింది. 2012 డిసెంబర్‌లో మాడి అనే పట్టణంలో ధ్రుబే ఏనుగు దాడిచేసి శనిచర తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన శనిచర.. తన కుటుంబాన్ని ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాప్తి నది దాటి దాదాపు 9 మైళ్ల దూరంలోని జగత్‌పూర్‌కు తన నివాసాన్ని మార్చాడు.ూాఎఎఅఎవత్ం & ఐఅయిర్వతీం ఇక తమకు ఆ ఏనుగు నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని భావించాడు. అయితే విధి వారిని వెక్కిరించింది. 14 ఏళ్ల తర్వాత అదే ధ్రుబే ఏనుగు వాసనతో పసిగట్టి వారిని వెతుక్కుంటూ వచ్చింది. ఈ నెల ఆరంభంలో జగత్‌పూర్‌లోని శనిచర ఇంటిపై దాడిచేసి, అతని 25 ఏళ్ల కోడలు ఆషికా బోటేను, 4 ఏళ్ల మనవడు భరత్ బోటేను అతి కిరాతకంగా చంపేసింది. ఈ ఘటనతో శనిచర బోటే కుటుంబం విషాదంలో మునిగిపోయింది. 'నదులు దాటి ఇంత దూరం వస్తే మమ్మల్ని ఏమీ చేయలేదని అనుకున్నాం. కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత అదే ఏనుగు మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి నా కోడలిని, మనవడిని బలిగొంది. ఇక పారిపోవడానికి చోటు కూడా లేదు' అంటూ ఆయన కన్నీరుమున్నీరయ్యారు. ధ్రుబే ఏనుగు నేపాల్‌లో అత్యంత ప్రమాదకరమైనదిగా పేరుగాంచింది. 2010 నుంచి ఇప్పటివరకు ఈ ఒక్క ఏనుగే 25 మందిని చంపినట్లు చిత్వాన్ నేషనల్ పార్క్ అధికారులు ధ్రువీకరించారు. "ఈ తాజా ఘటనకు ముందు ధ్రుబే 23 మందిని చంపినట్లు మా రికార్డుల్లో ఉంది. ఇప్పుడు జగత్‌పూర్‌లో ఇద్దరు మరణించడంతో ఆ సంఖ్య 25కు చేరింది" అని పార్క్ ప్రతినిధి అభినాష్ థాపా మగర్ తెలిపారు. ఈ ఏనుగు పేరు మీద వికీపీడియాలో ఒక పేజీ కూడా ఉండటం దాని భయానక చరిత్రకు నిదర్శనం. అటవీ అధికారులు ధ్రుబే కదలికలను పర్యవేక్షించడానికి 2016 నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నారు. దానికి ట్రాకింగ్ కాలర్ కూడా అమర్చారు. 2020, 2023లో ఆ కాలర్‌ను మార్చినప్పటికీ, దానిని పూర్తిగా నియంత్రించడంలో విఫలమయ్యారు. అడవులు తగ్గిపోవడం, మానవ నివాసాలు విస్తరించడం వల్ల నేపాల్‌లో ఇలాంటి ఘర్షణలు పెరుగుతున్నాయని, ఈ విషాదం దాని తీవ్రతను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిందని నిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# న్యాయస్థానానికే అబద్ధాలు చెబుతావా'


**కమెడియన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం**



**న్యూఢిల్లీ: జూలై 14( మహాప్రభ )**
దివ్యాంగుల మనసు నొప్పించేలా జోకులు వేసిన ఘటనకు సంబంధించిన కేసులో కమెడియన్ సమయ్ రైనా తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అబద్ధాలు చెప్పి న్యాయవ్యవస్థను అవహేళన చేశావంటూ మండిపడింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకుగానూ రూ.3 లక్షల జరిమానా విధించింది. కమెడియన్ సమయ్ రైనా, యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా తోపాటు మరికొందరు కమెడియన్లు తమ అభ్యంతరకర వ్యాఖ్యలతో దివ్యాంగుల మనసు బాధించేలా జోకులు వేశారని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. దివ్యాంగులకు కావాల్సింది గౌరవ మర్యాదలని, వారి విజయాలను కమెడియన్లు తమ వేదికల్లో చాటిచెప్పాలని సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం.. సమయ్ రైనా తన షోలకు దివ్యాంగులను ఆహ్వానించలేదని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ ధర్మాసనానికి తెలిపింది. దాంతో న్యాయస్థానం కమెడియన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'సమయ్ రైనా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే గాక.. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. దేశం వెలుపల ఉంటే తాము చట్టపరిధిలోకి రామని వారు భావిస్తున్నట్లున్నారు. ఇది పూర్తిగా అహంకారమే. ఇందుకు వారికి శిక్ష పడాల్సిందే' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహించింది. సమయ్ రైనాకు రూ.10 లక్షల జరిమానా విధించింది.అయితే ఆ తర్వాత కమెడియన్ తరఫు న్యాయవాదుల అభ్యర్థనతో జరిమానాను రూ.3 లక్షలకు తగ్గించింది. మరోసారి తప్పు చేస్తే ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంచుతామని హెచ్చరించింది. జరిమానాను రెండు వారాల్లోగా సుప్రీంకోర్టుకు డిపాజిట్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

# సంపాదకీయం

## విద్యా సంస్కరణల పేరుతో రాష్ట్ర అధికారాల కేంద్రీకరణా?




భారతదేశంలో విద్య అనేది కేవలం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నిర్వహణకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది దేశ ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం, శాస్త్ర సాంకేతిక ప్రగతి, ప్రజాస్వామ్య బలోపేతానికి పునాది. అందుకే భారత రాజ్యాంగం విద్యను కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయగల ఉమ్మడి జాబితాలో చేర్చింది. దీని ఉద్దేశం దేశవ్యాప్తంగా నాణ్యతను కాపాడుతూనే, స్థానిక అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాలు తమ విద్యా విధానాలను రూపొందించుకునే అవకాశాన్ని కల్పించడం. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ -2025 (విబిఎస్ఎ) బిల్లు ఈ సమతుల్యతను మార్చబోతుందా అనే ప్రశ్న దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఉన్నత విద్యలో సమూల సంస్కరణగా అభివర్ణిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) , నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సిటిఇ) వంటి సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, దేశవ్యాప్తంగా ఒకే నాణ్యతా ప్రమాణాలు అమలు చేయాలనేది ప్రభుత్వ వాదన. అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, నియంత్రణలో పారదర్శకత తీసుకు రావడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారత ఉన్నత విద్యను తీర్చిదిద్దడం ఈ బిల్లుకు ప్రధాన లక్ష్యాలని కేంద్రం చెబుతోంది.అయితే, ఈ బిల్లుపై వస్తున్న అభ్యంతరాలు కేవలం రాజకీయాలకే పరిమితం కావడం లేదు. ఆశ్చర్యకరంగా, బీజేపీ కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు కూడా ఇందులోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీని అర్థం ఈ వివాదం రాజకీయ పార్టీల మధ్య పోరాటం కాదని, కేంద్ర--రాష్ట్ర అధికారాల సమతుల్యతకు సంబంధించినదని చెప్పవచ్చు. రాష్ట్రాల ప్రధాన ఆందోళన ఏమిటంటే, ఈ బిల్లు ద్వారా ఉన్నత విద్యపై ఉన్న కీలక అధికారాలు క్రమంగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ విశ్వవిద్యాలయాల స్థాపన, విస్తరణ, కొత్త కోర్సులు, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలు రూపొందించే విషయంలో కీలక పాత్ర పోషించాయి. కొత్త వ్యవస్థలో నియంత్రణ, అక్రిడిటేషన్, నాణ్యతా ప్రమాణాలు, డిగ్రీల గుర్తింపు వంటి అంశాల్లో కేంద్ర సంస్థకే తుది అధికారం లభిస్తే, రాష్ట్రాల పాత్ర గణనీయంగా తగ్గిపోతుందని వారు భావిస్తున్నారు. భారతదేశం ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే సామాజిక పరిస్థితులు కలిగిన దేశం కాదు. తెలంగాణలో అవసరమైన విద్యా విధానం, నాగాలాండ్‌లో అవసరమైనది ఒకటిగా ఉండదు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, సముద్ర ఆర్థిక వ్యవస్థకు అవసరమైన కోర్సులు ఉండవచ్చు. కర్నాటకలో సాంకేతిక రంగం అవసరాలు ఎక్కువగా ఉండవచ్చు. ఈ భిన్నత్వాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాలను రూపొందించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకే కేంద్ర ప్రమాణాన్ని దేశమంతటికీ వర్తింపజేయడం వల్ల ప్రాంతీయ అవసరాలు నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ మరో కీలక అంశం విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో కాకుండా అకాడమిక్ స్వేచ్ఛతో అభివృద్ధి చెందాయి. పరిశోధన, కొత్త కోర్సుల రూపకల్పన, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా కార్యక్రమాల రూపకల్పన వంటి అంశాల్లో విశ్వవిద్యాలయాలకు స్వతంత్ర నిర్ణయాధికారం ఉండటం అభివృద్ధికి దోహదపడింది. ఈ బిల్లులో కేంద్ర నియంత్రణ అధికమైతే, ఆ స్వేచ్ఛ క్రమంగా తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వాదనలను పూర్తిగా కొట్టిపారేయలేం. భారత ఉన్నత విద్యలో నాణ్యత అసమానంగా ఉంది. కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రపంచ స్థాయిలో రాణిస్తుండగా, మరికొన్ని కనీస ప్రమాణాలకు కూడా చేరుకోవడం లేదు. నకిలీ డిగ్రీలు, నాణ్యతలేని ప్రైవేట్ కళాశాలలు, అనుమతుల ప్రక్రియలో అవినీతి వంటి సమస్యలు కూడా ఉన్నాయి. వీటిని పరిష్కరించడానికి సమగ్ర నియంత్రణ వ్యవస్థ అవసరమనే వాదనలో బలం ఉంది. ప్రశ్న మాత్రం ఒకటే-నాణ్యతను పెంచాలంటే అధికారాలన్నీ కేంద్రీకరించడమే ఏకైక మార్గమా? ఈ బిల్లుపై చర్చ మరో కోణాన్ని కూడా తెరపైకి తీసుకొచ్చింది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పలు రంగాల్లో అధికారాలను క్రమంగా తన వద్దకు కేంద్రీకరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. జీఎస్టీ అమలు తర్వాత రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యంపై జరిగిన చర్చల మాదిరిగానే, ఇప్పుడు విద్యా రంగంలో కూడా సమాఖ్య స్ఫూర్తి బలహీనపడుతుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది. విద్య వంటి సున్నితమైన రంగంలో కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయాల్సిన సమయంలో నియంత్రణ ఒకే కేంద్ర సంస్థ చేతుల్లోకి వెళ్లడం సమాఖ్య వ్యవస్థకు అనుకూలమా కాదా అన్నది ప్రధాన చర్చగా మారింది. ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు కూడా ఇదే విషయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కొనసాగాలని, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాలు రూపొందించే స్వేచ్ఛ ఉండాలని, కేంద్రం నాణ్యతా ప్రమాణాలను నిర్దేశించినా అమలులో రాష్ట్రాలకు నిర్ణయాత్మక పాత్ర కల్పించాలని ఆ రాష్ట్రం సూచించింది. ఇది కేవలం ఒక రాష్ట్రం సమస్య కాదు, దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అంశం. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఏకపక్షంగా అమలు చేయడం కంటే రాష్ట్రాలతో విస్తృతంగా చర్చించడం అవసరం. జాతీయ ప్రమాణాలు అవసరమే. కానీ వాటిని రూపొందించే ప్రక్రియలో రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించాలి. కొత్త నియంత్రణ సంస్థ పాలక మండలిలో రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి. రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి చట్టపరమైన హామీలు కల్పించాలి. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని రాష్ట్రాల వద్దే ఉంచాలి. “వికసిత్ భారత్” అనే లక్ష్యం కేవలం బలమైన కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యం కాదు. బలమైన రాష్ట్రాలు, స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా పనిచేసే విద్యా వ్యవస్థ, దేశవ్యాప్తంగా ఒకే నాణ్యతా ప్రమాణాలు-ఈ నాలుగు కలిసి పనిచేసినప్పుడే నిజమైన విద్యా సంస్కరణ సాధ్యమవుతుంది. విద్యలో నాణ్యతను పెంచడం ఎంత అవసరమో, భారత సమాఖ్య వ్యవస్థను కాపాడటం కూడా అంతే అవసరం. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించగలిగితేనే వికసిత్ భారత్ లక్ష్యం సార్థకమవుతుంది.

# పాలన గాడి తప్పుతోందా?



తెలంగాణాలో పదేండ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సగం కాలం పూర్తయినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో మంత్రి వర్గాన్ని విస్తరించలేదు. పైగా ఒక్కొక్క మంత్రి రెండు మూడు ప్రధాన విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో అన్నింటిపై సమీక్ష?, నిఘా లేకపోవటం వల్ల పాలన పట్టు తప్పుతుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. ఎందుకంటే, దానికి కొన్ని ఉదాహరణలూ లేకపోలేదు. ఈ నెల పదిన అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలను చూసి తెలంగాణ ప్రజానీకం దిగ్భ్రాంతికి గురైంది. నిందితుడు పార్వతి రాజ్‌కుమార్ షాబాద్‌లో నివాసం ఉంటూ పక్కింటి మైనర్ బాలికను వేధించటం వల్ల అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆశ్చర్యకర విషయమేమంటే ఈ కేసులో సాధారణంగా బెయిల్ దొరకటం కష్టం. కానీ రాజ్‌కుమార్ విషయంలో యాంటిసిపేటరీ బెయిల్ దొరికిందంటే షాబాద్ పోలీసుల నిర్లక్ష్యం, అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అమ్మాయిని వేధిస్తుంటే బాధిత కుటుంబసభ్యులు అనేకమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, లంచాలకు మరిగిన పోలీసులు నిర్లక్ష్యం వహించారు. పైగా పోక్సో కేసులో కూడా బెయిలెబుల్ సెక్షన్లు పెట్టడంతో రాజకుమార్ ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. బాలిక కుటుంబపై కక్ష? పెంచుకుని బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను హత్య చేశాడు. అంతటితో ఆగకుండా తన భార్యతో పాటు ఇద్దరు కొడుకులనూ నిర్దాక్ష?ణ్యంగా చంపేసి అద్దె కారులో పరా య్యాడు. ముఖ్యమంత్రిగా హోం శాఖను కూడా తన ఆదీనంలో పెట్టుకున్న రేవంత్ రెడ్డి ఆ బాధిత కుటుంబానికి, శాంతి భద్రతల విషయంలో తెలంగాణ ప్రజానీకానికి ఏమి సమాధానం చెబుతాడు? పోలీస్ వ్యవస్థనే కాదు, ఆ మాటకొస్తే అన్ని శాఖలు దాదాపు పూర్తిస్థాయిలో అవినీతిలో కూరుకుపోయాయి. ముఖ్యంగా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, విద్యుత్, ఇలా అనేక శాఖల్లో లంచాలు తీసుకుంటూ చాలామంది అధికారులు ఏసీబీకి పట్టుపడుతున్నారు. వ్యవస్థలు ఇంతగా కుళ్లి పోవటానికి ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వానిది బాధ్యత అయితే, దాన్ని అరికట్టలేని ప్రస్తుత సర్కార్‌ది కూడా ఇందులో భాగస్వామ్యం ఉంది. అలాగే ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశానికి హైదరాబాద్‌లోనే ఉండి మంత్రివర్గ సమా వేశానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. దీనికి కారణం వెతికితే ఆమె ముఖ్యమంత్రిపై అలక పూని నట్టుగా చెప్పుకొంటున్నారు. ఇటీవల యాదగిరి గుట్ట దేవస్థాన ధర్మకర్త మండలి కమిటీ నియామకమైంది. ఆమెను సంప్ర దించకుండానే చైర్‌పర్సన్, సభ్యులను నియమించారని, అందుకే మంత్రివర్గ సమావేశానికి రాలేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరో విషయం, ఇటీవల ముఖ్యమంత్రి టూరిజం శాఖపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష?లో సంబంధిత శాఖ మంత్రి అయిన జూపల్లి కృష్ణారావు లేరు. ఆ సమయంలో ఆయన కొల్లాపూర్‌లోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బావిలో ఈతకొడుతూ సేదతీరుతున్న వీడియోను వైరల్ అయింది. సీఎంతో రివ్యూ ఉందంటే సంబంధిత మంత్రి స్వయంగా మాట్లాడి డేట్ తీసుకోని ఉండాలి. లేదా సీఎంఓ నుంచి ఓఎస్‌డిని గానీ, మంత్రినిగానీ సంప్రదిదంచి సమావేశ తేదీ నిర్ణయించటం పరిపాటి. స్వయంగా సీఎం ఒక శాఖను రివ్యూ చేస్తుంటే సంబంధిత మంత్రి హాజరు కాకపోవటం, పైగా తాను ఈతకొడుతున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయటం ధిక్కార స్వరం అనటంలో సందేహం లేదు! ఏ వృత్తిలోనైనా క్రమశిక్షణ ముఖ్యం. మరి రాజకీయాల్లో చాలా అవసరం. ఎందుకంటే చాలామందిపై వారు చేసే పనుల ప్రభావం పడుతుంది. కానీ రాష్ట్రంలోని కొందరు మంత్రుల ప్రవర్తన, సీనియర్ల అలక, సీఎంకు పరిపాలనలో అనుభవం లేకపోవటం ఇలాంటి వాటికి కారణంగా కనిపిస్తోంది. ఇప్పటికే సమయం మించిపోయింది. పరిపాలనలో పట్టుకోల్పోతే పుట్టి మునగటం కాయం. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అన్ని శాఖల మంత్రులతో సమీక్ష?లు నిర్వహించి పాలనను పటిష్టపరచాలి. లేదంటే ప్రజల్లో ఉన్న కాస్త విశ్వాసం కూడా పోతుంది.

# ఇథనాల్‌ను నిందించకండి

**- ఈ20 ఇంధనాన్ని సమర్థించుకున్న నితిన్ గడ్కరీ**

**న్యూఢిల్లీ జూలై 14( మహాప్రభ )**
వాహనాల్లో ఈ20 ఇంధన వినియోగాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమర్థించుకున్నారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్ వాహనాల గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇథనాల్ వల్లే వాహనాల్లో సమస్యలు వస్తున్నట్లు నిందారోపణలు చేయరాదు అన్నారు. ఈ20 పెట్రోల్ వల్ల తన మెర్సిడీజ్ బెంజ్ ఎస్‌యూవీలో మైలేజీ తగ్గిందని, ఆ పెట్రోల్ వల్ల ఇంజిన్ సమస్య వచ్చినట్లు యూట్యూబర్, వ్లోగర్ సౌరవ్ జోషి తన వీడియోలో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో మెర్సిడీజ్-బెంజ్ ఇండియా కంపెనీ ఓ ప్రకటన చేసింది. ఈ20 ప్యూయల్‌కు తగినట్లు బీఎస్6 పెట్రోల్ వాహనాలు



ఉన్నాయని ఆ కంపెనీ చెప్పింది. బెంజ్ కంపెనీ వివరణ ఇవ్వడంతో ఈ20 వివాదంపై చర్చ మరింత ముదిరింది. ఈ20 ఆందోళనల నేపథ్యంలో కేంద్ర మంత్రి గడ్కరీ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ ఇంధనం వైపు ప్రజలను మళ్లించే అంశంలో ప్రభుత్వం పారదర్శకంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలుసు అని, తమ విధానం, రోడ్‌మ్యాప్.. ప్రజలను బయోఫ్యూయల్స్ వైపు మళ్లించడమే అని ఆయన అన్నారు. ఇంధనం అంశంలో స్వయం సమృద్ధి సాధించాలని, ఆత్మనిర్భర్ భారత్ విజన్ ఇదే అని ఆయన అన్నారు. ప్రతి వాహనంలో మెకానికల్ సమస్యలు వస్తాయని, వాటిని ఆటోమెటిక్‌గా ఇథనాల్ బ్లెండింగ్‌తో లింక్ చేయవద్దు అని గడ్కరీ అన్నారు. వాహనాల్లో సమస్య వస్తే, వాటి ఓనర్లు ముందుగా తనిఖీ చేసుకోవాలని, కానీ ఇంధనం వల్లే ఆ సమస్య వచ్చిందని ఇథనాల్‌కు లింకు చేయరాదు అని అన్నారు. ఈ20 ఫ్యూయల్.. కొత్త, పాత వాహనాలకు సురక్షితమైందని మంత్రి గడ్కరీ అన్నారు. తప్పుడు సమాచారంతో గందరగోళం సృష్టిస్తున్నారని, వాస్తవాల కన్నా ఎక్కువగా రాజకీయాలు క్రియేట్ చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

# స్టేషన్ కి వచ్చే వారితో మర్యాదగా మెలగాలి

**-సివిల్ వివాదాల్లో తల దూర్చొద్దు**
**-కేసులను త్వరితగిన పరిష్కారం చేయాలి**
**-డి ఎస్పీ రవీందర్**

**భువనగిరి, జూలై 14( మహాప్రభ )**
భువనగిరి డీఎస్పీ బి. రవీందర్,భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్ మరియు భువనగిరి,టౌన్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించి స్టేషన్‌ల,పనితీరు,రికార్డులు పెండింగ్ కేసులు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా డి ఎస్పీ మాట్లాడుతూ,పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటీషనర్,బాధితుడితో పోలీసులు మర్యాద పూర్వకంగా,సానుభూతితో వ్యవహరించాలని సూచిం చారు.ప్రజలతో గౌరవ ప్రదంగా వ్యవహరించినప్పుడే పోలీసుల,పట్ల విశ్వాసం గౌరవం పెరుగుతుందని తెలిపారు.అలాగే,పోలీసు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సమాజంలో



పోలీస్ శాఖకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు.స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించిన డీఎస్పీ,ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని అధికా రులను ఆదేశించారు. పెండింగ్‌లో,ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా,అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు ఫిర్యాదు అందిన వెంటనే పెట్రో కార్ సిబ్బంది,బ్లూ కోల్ట్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు,తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో,పోలీసులే వారి వద్దకు వెళ్లి సంఘటనా స్థలంలోనే ఫిర్యాదు స్వీకరించి,అవసరమైతే అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా,సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.అలాగే, ప్రతి పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ,5ఎస్ విధానాలను పాటించి క్రమశిక్షణతో నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఇట్టి ,కార్యక్రమంలో భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు,అలాగే మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. కృష్ణ ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా వివరాలను వేగవంతం చేయాలి





**గ్రామాలను పరిశీలించిన తహసీల్దార్ కె. శ్రీనివాస్**

**వనపర్తి జిల్లా ప్రతినిధి జూలై 14( మహాప్రభ )**
చిన్నంబావి మండలంలోని ఓటరు జాబితా ప్రత్యేక సవరణను వేగవంతం చేయాలని అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ కె. శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వెలగొండ, భీమ్ల తండా, మియాపూర్, బెక్కెం గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటలైజేషన్ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన, తప్పులు లేకుండా పూర్తి చేయాలని బీఎల్‌వోలు, జీపీవోలకు సూచించారు. ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. పరిశీలనలో మండల గిర్దావర్ కురుమూర్తి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, జీపీవోలు, గ్రామ నాయకులు, ఓటర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మద్దిమడుగు రామస్వామికి బార్ అసోసియేషన్ ఘన సన్మానం




**దేవరకొండ జూలై 14( మహాప్రభ )**
కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన మద్దిమడుగు రామస్వామి ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే బాలునాయక్ మద్దతుతో పార్టీలో కీలక బాధ్యతలను చేపట్టిన రామస్వామి ని, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్ మరియు సీనియర్ న్యాయవాదులు శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోహిత్ రెడ్డి, రాములు మాడెం, రామశంకర్, ఐ.వి. ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, ఎర్రకృష్ణ, రవికుమార్, యు. రమేష్, కోరె కిషన్, రాజశేఖర్, జున్నిద్దయ్య, గణేష్, శ్రీకాంత్, ఎం. యాదయ్య, రాజు, వసుకుల శీను తదితర మిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దిమడుగు రామస్వామి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, సహకరించిన ఎమ్మెల్యే బాలునాయక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరి సమన్వయంతో నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల తొలి బోనాల జాతరకు తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు క్యమ మల్లేష్‌కు ఆహ్వానం.



**ఎల్బినగర్ - జూలై 14 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల తొలి బోనాల జాతర సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు క్యమ మల్లేష్ ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ ఆడాల గణేష్ , రాష్ట్ర సంఘం పెద్దలు కలిసి జాతర ఆహ్వాన పత్రికను అందజేసి, ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసి కుమ్మర సమాజాన్ని ఆశీర్వదించాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కుమ్మర్ల తొలి బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఓటరు ఫారాల పూరణలో సహకారం అందిస్తున్న బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**గడ్డి అన్నారం -14 జూలై (మహాప్రభ)**
ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన పోలిశెట్టి శంకరయ్య మరియు వారి కుటుంబ సభ్యుల ఓటరు ఫారాల పూరణలో ఎదురైన ఇబ్బందులను తెలుసుకున్న బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ శ్రీ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి వారి నివాసానికి స్వయంగా వెళ్లి సహాయం అందించారు.
ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఓటరు ఫారాలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయించి ఫారాల పూరణలో సహకరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అర్హత ఓటరికి సేవలు అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి నిర్ణయించిన గడువు తక్కువగా ఉండటంతో తొందరపాటులో ఫారాల్లో పొరపాట్లు జరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రజలు సంబంధిత బి ఎల్ ఓ లేదా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీ ఎల్ ఏ లను సంప్రదించి సరైన సమాచారం ఆధారంగా ఫారాలను పూరించాలని సూచించారు. అలాగే, ఓటరు ఫారాల పూరణలో ఎవరికైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే ఎలాంటి సంకోచం లేకుండా తన వ్యక్తిగత వాట్సాప్ లేదా ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సేవలను ఎల్లప్పుడూ అందించేందుకు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.

## బైరామల్‌గూడ ఆట స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**ఎల్ బి నగర్**
**-14 జూలై (మహాప్రభ)**
ఎల్ బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బైరామల్‌గూడ ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన ఆట స్థలాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఆడుకుంటున్న చిన్నారులు ఆట స్థలంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నారుల భద్రత, సౌకర్యాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆట స్థలంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో ఆడుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పెండింగ్ స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్‌ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

**-ఇందిరా పార్క్ వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య చేపట్టే సత్యాగ్రహ దీక్షకు సంఘీభావ ర్యాలీ**

**-పాత పద్ధతిలో ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని కొనసాగించాలి లేకపోతే యుద్ధమే.**

**-సామాజికవేత్త, ఏపీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.**




**దేవరకొండ జూలై 14( మహాప్రభ )**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి 10,500 కోట్ల స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్ లు తక్షణమే విడుదల చేయాలని సత్యాగ్రహ దీక్ష చేస్తుండగా దేవరకొండ పట్టణంలో సంఘీభావంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిండి రోడ్డు వద్ద గల మీనాక్షి సెంటర్ నుండి కోర్టు మీదుగా వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద కు చేరుకొని అంబేద్కర్ కు పూలమాలవేసి నిరసన వ్యక్తం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్, రీయంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి. లేని పక్షాన త్వరలో కార్యాచరణ ప్రకటించబో తున్నాము ప్రభుత్వము విద్యార్థులను రోడ్ల మీదకి తీసుకొచ్చే దుస్థితి తీసుకువచ్చిందని విద్యార్థులు ఆగ్రహాన్ని ప్రభుత్వాలు తెచ్చుకోవద్దని ఆగ్రహంతో ఉద్యమిస్తే ఏ ప్రభుత్వాలు ఇప్పటివరకు నిల్వలేదని గత ప్రభుత్వానికి పట్టినటువంటి గతి ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు అన్ని కార్యక్రమాలకు నిధులు ఉంటాయి. కానీ విద్యార్థుల భవిష్యత్తు పేద, బడుగు బలహీనవిద్యార్థుల యొక్క భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిధులు కేటాయించకుండా చదువుకు దూరం చేసే పరిస్థితి తీసుకొస్తుందని దశలవారీగా ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని, ఇలాంటి కుట్రలను బలహీన వర్గాల కేనా, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసి రియంబర్స్మెంట్ పథకాన్ని సాధించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగొని శివ గౌడ్, అప్పం వీరయ్య, పున్న బిక్షమయ్య, కాటం వెంకటేష్ గౌడ్ , ఆదారపు గణేష్, ఆకారపు గౌతమ్, నాగపల్లి సుధాకర్, రామావత్ రాము, ఆంజనేయులు, వింజమూరు వెంకటేశ్వర్లు, లిఖిత, దీపక్ ,చిన్న నాయక్, శాంతి రాజు, రామావత్ పాండు నాయక్, వర్త్య రమేష్ తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

**-ఎస్.ఎఫ్. ఐ. దేవరకొండ డివిజన్ కమిటీ**




**దేవరకొండ జూలై 14( మహాప్రభ)**
దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాల ఆశలను మోస్తున్న నీట్-2026 పరీక్ష మరోసారి అవినీతి,నిర్లక్ష్యం,కోచింగ్ మాఫియా -- అధికార యంత్రాంగం కుమ్మక్కు కారణంగా విద్యార్థుల శాపంగా మారిందని.నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ,ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కోదాడడజడ్చర్ల జాతీయ రహదారి పై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్మాట్లాడుతూ నీట్-2026 పరీక్షలో పేపర్ లీకేజీ, భారీ అక్రమాలు వెలుగులోకి రావడం కేంద్ర ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఎన్.జైరాం,సబావత్ వినోద్,ఎం.నాగరాజు,కే. మహేష్,ఏ.శివ.ఎల్.అశోక్, భరత్,కార్తీక్,అభిషేక్,గోపి, జయంత్,గోవిందా రాజ్,శ్రీధర్, ప్రవీణ్, సందీప్, సాయిరాంలి,తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల చేరికల్లో కన్కల్ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు



**తాడ్వాయి జులై 14 (మహాప్రభ)**
తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను గణనీయంగా పెంచిన కృషికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు (డీఎస్ఈ కమిషనర్) నవీన్ నికోలస్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో గతంలో 108 మంది విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలను ప్రస్తుతం 280కు పైగా విద్యార్థులు చదువుతున్న ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు ఆకర్షిస్తూ చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. ఈ విషయం ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న డీఎస్ఈ కమిషనర్ నవీన్ నికోలస్, కన్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆశాజ్యోతి, గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి,లను ప్రత్యేకంగా డీఎస్ఈ, కార్యాలయానికి ఆహ్వానించి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆశిరెడ్డి, విజయకుమార్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కన్కల్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఆదర్శ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గశీ దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షమయ్య గౌడ్, పాల్గొని పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్లను, ఉపాధ్యాయులను, అభినందించారు.

## అమావాస్య సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమాల్లో పాల్గొన్న కొత్తపేట మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్





**కొత్తపేట - 14 జూలై (మహాప్రభ)**
ఈ రోజు అమావాస్య సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని కమర్షియల్ టాక్స్ కాలనీ కమాన్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయంలో బీజేపీ నాయకులు ఊరెల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో, అలాగే మోహన్ నగర్ చౌరస్తా వద్ద శ్రీ రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఉపేందర్ సింగ్ ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి వారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్నదానం మహాదానం అని మన భారతీయ సంస్కృతి చెబుతోందని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప దానం మరొకటి లేదని అన్నారు. సమాజ సేవా భావంతో ఇటువంటి అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రామ సేవా సమితి సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా మద్దిమడుగు రామస్వామి నియామకం




**దేవరకొండ జూలై 14 ( మహాప్రభ )**
నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా నూతనంగా ఎన్నికైన అడ్వకేట్ మద్దిమడుగు రామస్వామి ని రాంపూరం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాంపూరం సర్పంచ్ శ్రీమతి అనిత లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై, రామస్వామి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మరియు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, విద్యావంతుడైన రామస్వామికి పార్టీలో కీలక బాధ్యతలు దక్కడం సంతోషకరమని, తన మేధస్సుతో పార్టీని మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను సత్కరించిన సర్పంచ్ అనిత లక్ష్మణ్ కి, గ్రామ ప్రముఖులకు మరియు కార్యకర్తలకు రామస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత లక్ష్మణ్ తో పాటు శివాజీ (మాజీ సర్పంచ్), భీముడు (ఉపసర్పంచ్), గణేష్, శివ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# భీమారంలో ఎస్ఐఆర్‌కు జనం బారులు.

ఒక్కరోజులోనే 15% నుంచి 50%కి చేరిన ఓటరు నమోదు.



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జూలై 14( మహాప్రభ )**
భీమారం గ్రామపంచాయతీలో సర్పంచ్ ఇస్కమల్ల విజయలక్ష్మి పున్నం చందు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. నిన్నటి వరకు 15 శాతం మాత్రమే నమోదైన ఓటరు ఎన్యూమరేషన్, సర్పంచ్ విజ్ఞప్తి మేరకు మంగళవారం ప్రజలు పెద్ద సంఖ్యలో గ్రామపంచాయతీకి తరలిరావడంతో 50 శాతానికి చేరుకుంది. గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఓటరు నమోదు అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అక్కడే ఉండి దరఖాస్తుల స్వీకరణ, ఫారాల పూర్తి, సందేహాల నివృత్తిలో ఓటర్లకు సహాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి పున్నం చందు మాట్లాడుతూ, ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. నమోదు తక్కువగా ఉండటంతో ప్రజలను కోరగా స్వచ్ఛందంగా వచ్చి ఫారాలు సమర్పిస్తున్నారు. నేటికి 50 శాతం పూర్తయింది అని తెలిపారు. మిగిలిన ఓటర్ల కోసం బుధ, గురు వారాల్లో కూడా గ్రామపంచాయతీలో ఓటరు నమోదు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉప తహసీల్దార్, గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, ఓటరు నమోదు అధికారులు, వార్డు సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు. సహకరించిన ప్రజలకు, సిబ్బందికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ హెల్ప్‌డెస్క్‌కు విశేష స్పందన.

-సజావుగా సాగిన కార్యక్రమం

- వార్డు సభ్యులు సంతోష్ కుమార్ కృతజ్ఞతలు.



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 14( మహాప్రభ )**
జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయితీ లోని మొదటి వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎన్యూమరేషన్ హెల్ప్‌డెస్క్ కార్యక్రమానికి వార్డు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వార్డు సభ్యులు ముక్త సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు మన హక్కు, బాధ్యత. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు అధికారులు నళిని, లత,సందీప్ హెల్ప్‌డెస్క్ వద్ద ఓటర్లకు సేవలందించారు. ఎస్ఐఆర్ ఫారాలను నింపడం, అవసరమైన పత్రాలు సమర్పించడం, ఓటరు జాబితాకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడం వంటి అంశాలపై ఓటర్లకు పూర్తి సహకారం అందించారు.
వార్డు పరిధిలోని ఓటర్లు పెద్ద ఎత్తున హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు సహకరించిన ఓటరు నమోదు అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్న ప్రతి ఓటరుకూ వార్డు సభ్యులు ముక్త సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**(కరీంనగర్ జిల్లా బ్యూరో/ జూలై 14( మహాప్రభ )**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.చొప్పదండి మండలం రుక్మాపూర్ లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను చిన్న చిన్న భాగాలుగా విభజించి పూర్తిచేయాలని సూచించారు.నిర్మాణ పరిసరాలను కలియ తిరుగుతూ సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి తహసీల్దార్ నవీన్ కుమార్,ఎంపీడీవో వేణుగోపాల్ టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాళ్ళకల్ లో పసిపాపపై పాశవికం.. మృగానికి జీవిత ఖైదు

- ఏళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసులో ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పు

-నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష.. రూ.10 వేల జరిమానా

-బాధిత చిన్నారికి రూ.5 లక్షల పరిహారం




**మెదక్, జూలై 14.(మహా ప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ డివిజన్ పరిధి కాళ్ళకల్ లో మూడున్నరేళ్ల పసిపాపపై అత్యంత అమానుషంగా లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మెదక్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. నిందితుడు లితున్న కుమార్ (20)లికు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి తీర్పు వెలువరించారు. అలాగే బాధిత చిన్నారికి రూ.5 లక్షల విక్టిమ్ కాంపెన్సేషన్ మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. 2025 మార్చి 10న మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళ్ళకల్ గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన మూడున్నరేళ్ల చిన్నారిని బీహార్‌కు చెందిన తున్న కుమార్ ఎత్తుకెళ్లి గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద లైంగిక దాడికి పాల్పడ్డాడు.
చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనతో గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు చిన్నారిని తీసుకెళ్తున్న దృశ్యాలు గుర్తించారు. అనంతరం చెరువు కట్ట వద్ద చిన్నారి ఏడుపు వినిపించడంతో అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులను చూసి నిందితుడు పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న చిన్నారిని వెంటనే రక్షించి ఆసుపత్రికి తరలించారు.
బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేశారు. తూప్రాన్ డీఎస్పీలు వెంకట్ రెడ్డి, నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో పోలీసులు శాస్త్రీయ ఆధారాలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు తదితర కీలక సాక్ష్యాలను సేకరించి కోర్టులో పటిష్టమైన ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత చిన్నారి కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు అవసరమైన సహకారం అందించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రత్యేక పోక్సో కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.ఈ కేసులో లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీవో మహిపాల్ రెడ్డి సమన్వయంతో పనిచేశారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, దర్యాప్తు అధికారులు, భరోసా బృందం, లైజనింగ్ ఆఫీసర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది.ఇలాంటి నేరస్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు. ప్రతి చిన్నారి భద్రత సమాజం, తల్లిదండ్రులు, పోలీసు వ్యవస్థల ఉమ్మడి బాధ్యత" అని స్పష్టం చేశారు.

# జాతీయ డీ-వార్మింగ్ దినోత్సవం సందర్భంగా 800 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ







-తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

-మూగజీవాల ఆరోగ్యమే లక్ష్యం..

**తూప్రాన్, జూలై 14.(మహా ప్రభ)**
జాతీయ డీ-వార్మింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో మంగళవారం తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ ఉచిత పశువైద్య సేవా కార్యక్రమం నిర్వహించారు. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరంలో సుమారు 600 మేకలు, 200 గొర్రెలకు నట్టల (డీ-వార్మింగ్) నివారణ మందులు పంపిణీ చేసి చికిత్స అందించారు. దాదాపు రూ.5 వేల విలువైన ఔషధాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఇస్లాంపూర్ అసిస్టెంట్ పశు వైద్యాధికారి లయన్ డాక్టర్ లింగమూర్తి నేతృత్వంలో నిర్వహించారు. పశువుల యజమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పశువులకు నట్టల నివారణ మందులు వేయించుకుని వైద్యుల సూచనలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ లింగమూర్తి మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలకమని, వాటి ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజ సేవలో భాగంగా తూప్రాన్ లయన్స్ క్లబ్ మూగజీవాలకు సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు.తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో కొత్త నీరు, తడి మేత కారణంగా పశు వుల కడుపులో నట్టలు ఏర్పడి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పశువైద్యుల సలహా మేరకు ముందస్తు జాగ్రత్త చర్యగా డీ-వార్మింగ్ మందులు వేయించడం ద్వారా మూగ జీవాలు మేకలు, గొర్రెల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు రైతులకు ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చని వివరించారు. భవిష్యత్తులో కూడా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. మూగజీవాల సంక్షేమానికి అంకితమైన ఈ సేవా కార్యక్రమం రైతుల ప్రశంసలు అందుకోగా, తూప్రాన్ లయన్స్ క్లబ్ మరోసారి తన సామాజిక సేవా స్ఫూర్తిని చాటుకుంది. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్, లయన్ డాక్టర్ లింగమూర్తి, లయన్ దేవత సాయికుమార్ గుప్త, లయన్ కొక్కొండ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దేశ్వరాలయంలో అన్నదాన కార్యక్రమం




**జహీరాబాద్, జూలై 14( మహాప్రభ )**
జహీరాబాద్ పట్టణం అల్గోల్ రోడ్డు లోని శ్రీ సిద్దేశ్వరాలయంలో ఆషాడ మాసం అమావాస్య సందర్భంగా సందర్భంగా స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు సంగమేశ్వర్ స్వామి రుద్రాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రతి అమావాస్య తో పాటు ప్రతి సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సంగమేశ్వర్ స్వామి పేర్కొన్నారు. కుంకుమార్చన కార్యక్రమం లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప, శివశక్తి సంఘం బాధ్యులు సూదాం వెంకట్, గాల్ రెడ్డి, శంకర్, ఎన్నం రఘు, మధుమాలా, అమర్ నాథ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం నాడు ఆషాడ అమావాస్య సందర్భంగా స్వామి వారికి విశిష్ట పూజా క్రతువులు నిర్వహించారు

## రామాయంపేటలో వరుస అవినీతి ఆరోపణలు విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



**రామాయంపేట, జూలై 14, (మహాప్రభ /** రామాయంపేట నియోజకవర్గంలో అవినీతి జరిగిన ఎంతో మంది ఫిర్యాదులు చేసిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని బిజెపి నాయకులు వారి వ్యవహారాలపూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ...

**ప్రధాన ఆరోపణలు:**

1. సొసైటీ చైర్మన్ బాదే చంద్రం వ్యక్తిగత ఖాతాలోకి రూ. 73 లక్షలు మళ్లింపు
2. మున్సిపాలిటీలో రూ. 1.60 కోట్లు అక్రమాలు
3. కొనాపూర్‌లో రూ. 5 కోట్ల మెగా స్కాం

అవినీతి సొమ్మును వాటా చేసుకోవడం కోసం సోషల్ మీడియాలో దుర్భాషలాడుతూ కొట్లాడుతున్నారని వారు ఆరోపించారు.

**డిమాండ్:**

స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై శంకర్ గౌడ్, అవినాష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సామాన్య రైతులు, ప్రజల సొమ్మును దోచుకున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెపి స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియా లో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దాంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు , రియల్టీ , ఆటో స్టాక్స్ లో భారీగా నష్టాలు నమోదయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 561.46 పాయింట్లు నష్టపోయి 77,054.94 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 159 పాయింట్లు క్షీణించి 24,052.05 వద్ద ముగిసింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. కొన్ని రక్షణాత్మక రంగాల షేర్లు నిలదొక్కుకున్నప్పటికీ కీలక రంగాల్లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. నిఫ్టీలో హెచ్‌సీఎల్ టెక్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ షేర్లు ఎక్కువగా నష్టపోయి సూచీపై భారం మోపాయి. ఈ బలహీనత బ్రాడర్ మార్కెట్లకు కూడా విస్తరించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.44 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.01 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే దాదాపు అన్ని సూచీలు నష్టాల్లోనే ట్రేడయ్యాయి. నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఆటో అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే ఈ ప్రతికూల ధోరణికి భిన్నంగా నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ లాభాలతో ముగిసింది. మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు ఫార్మా వంటి సురక్షిత రంగాల వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ ఫలితాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ ఉద్రిక్తతలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి.

## మళ్లీ బంగారం ధరలు ఢమాల్.. గంటల్లోనే భారీ మార్పులు.. ప్రస్తుతం తులం ఎంతంటే..?



బంగారం కొనుగోలు చేసేవారికి గుడ్ న్యూస్. ధరలు మళ్లీ దిగొస్తున్నాయి. గత వారంలో ధరలు భారీగా పెరగ్గా.. ఈ వారం ప్రారంభంలోనే డౌన్ అవుతూ వస్తోన్నాయి. సోమవారం ధరలు రూ.1500 మేర తగ్గగా.. మంగళవారం కూడా క్రాష్ అయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలు పసిడి ధరలపై ఎక్కువగా ప్రభావితం చూపిస్తూ ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా దేశాల మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకుంటే ధరల్లో భారీగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధంతో బంగారం, వెండి ధరలు తారుమారు అవుతున్నాయి. యుద్ధం క్రమంలో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడంతో గోల్డ్ రేట్లు కుప్పకూలుతూ వస్తోన్నాయి. అంతర్జాతీయంగా గోల్డ్ రేట్లు పడిపోగా.. ఇండియాలోనూ అదే పరిస్థితి నెలకొంది. మంగళవారం బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం.

**గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయంటే..?**

-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,42,800 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,30,900గా ఉంది.

-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,460 వద్ద ట్రేడవుతోండగా.. ఇవాళ ఒక్కరోజే రూ.540 తగ్గాయి. 22 క్యారెట్ల రేటు రూ.1,31,500గా ఉండగా.. నేడు రూ.500 పడిపోయింది.

-బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,42,800గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,30,900 వద్ద కొనసాగుతోంది

-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,950గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,31,050 వద్ద కొనసాగుతోంది.

**వెండి ధరలు ఇలా..**

-వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఢిల్లీలో కిలో వెండి రూ.2.35 లక్షల వద్ద ట్రేడవుతోంది

-హైదరాబాద్‌లో కేజి సిల్వర్ ధర రూ.2.35 లక్షల వద్ద కొనసాగుతోంది. నిన్న రూ.2.40 లక్షలులగా ఉండగా.. మంగళవారం రూ.5 వేలు తగ్గుముఖం పట్టింది

-చెన్నైలో కిలో వెండి రేటు రూ.2.35 లక్షలుగా ఉండగా... సోమవారం రూ.2.40 లక్షల వద్ద కొనసాగింది

-బెంగళూరులో కిలో వెండి ధర రూ.2.35 లక్షల వద్ద కొనసాగుతోంది

## హీరో సరికొత్త ఈ-స్కూటర్.. ప్రారంభ ధర రూ.1.44 లక్షలు

**న్యూఢిల్లీ,**

దేశీయ మార్కెట్లోకి హీరో మోటోకార్ప్ సరికొత్త ఈ స్కూటర్‌ను పరిచయం చేసింది. విదా ఈవూటర్ వీఎక్స్2 ప్లస్ పేరుతో విడుదల చేసిన ఈ స్కూటర్ ధర రూ.1,43,990గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 4.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్ సింగిల్ చార్జింగ్‌తో 187 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.కేవలం మూడున్నర గంటల్లోనే 80 శాతం వరకు బ్యాటరీ రీచార్జికానున్నది. సుదూర ప్రయాణాలు చేసేవారికి ఈ స్కూటర్ ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 6 వేల ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు, 700కి పైగా సర్వీస్ టచ్‌పాయింట్లను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు.



# స్పోర్ట్స్

## వెంటాడిన భుజం గాయం.. సాత్విక్ -- చిరాగ్ జోడీ నిష్క్రమణ..!

జపాన్ ఓపెన్‌లో దుమ్మురేపాలనుకున్న భారత డబుల్స్ ద్వయం కల చెదిరింది. టోర్నీలో ఫేవరెట్ అయిన సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జంట అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మొదటి మ్యాచ్‌లోనే సాత్విక్ సాయిరాజ్‌కు భుజం గాయం తిరగబెట్టడంతో ఇక ఆడలేమంటూ.. తొలి ఈ స్టార్ జోడీ కోర్టును వీడింది. దాంతో.. డెన్మార్క్ జంటను విజేతగా ప్రకటించారు నిర్వాహకులు. ఫేవరెట్‌గా జపాన్ ఓపెన్ బరిలో నిలిచిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం తొలి మ్యాచ్‌తోనే ఇంటిదారి పట్టింది. డెన్మార్క్ ఆటగాళ్లు డానియెల్ లుండ్‌గార్డ్ -- మాడ్స్ వెస్టెర్‌గార్డ్‌తో మ్యాచ్ సమయంలో సాత్విక్ కుడి భుజం గాయంతో ఇబ్బందిపడ్డాడు. నొప్పి కారణంగా అతడు ఆటను కొనసాగించలేకపోయాడు. దాంతో.. భారత జంట టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఈ ఏడాది పలుమార్లు సాత్విక్ భుజం గాయంతో బాధపడ్డాడు. మార్చి నెలలో ఇదే సమస్యతో సాత్విక్ చిరాగ్ ద్వయం స్విట్జర్‌లాండ్ ఓపెన్ నుంచి ఇంటొకొచ్చేసింది. ఏప్రిల్‌లో



బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్.. అనంతరం ఇండోనేషియా ఓపెన్‌లో సైతం వీరు ఆడలేదు. అయితే.. థామస్ కప్‌లో కాంస్యం.. సింగపూర్ ఓపెన్‌లో టైటిల్ విజయంతో దారిలో పడిన ఈ జంట.. జపాన్ ఓపెన్‌ను బాధతో వీడక తప్పలేదు. అసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా పెట్టుకున్న సాత్విక్ -- చిరాగ్ .. అంతకంటే ముందే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడనున్నారు.

## టీమిండియాకు షాక్..


### కోచ్‌గా వైదొలుగుతున్న డస్చేట్..!



వరసగా రెండు టీ20 సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టుకు మరో షాక్. సహాయక కోచ్ రియాన్ టెన్ డస్చేట్ తన బాధ్యతల నుంచి వైదొలగనున్నాడు. వ్యక్తిగత కారణాలతో అతడు ఒక కొనసాగవద్దనే నిర్ణయానికి వచ్చాడని సమాచారం. ఇదే విషయాన్ని డస్చేట్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐకు అతడు తెలియజేశాడు. ఒకవేళ గౌతీ, భారత బోర్డు ఆమోద ముద్ర వేస్తే ఇంగ్లండ్ పర్యటనతోనే టీమిండియా అసిస్టెంట్ కోచ్‌గా డస్చేట్ పదవీకాలం ముగియనుంది. టీ20ల్లో ఊహించని విధంగా ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో టీమిండియా వైట్‌వాష్‌కు గురయ్యాక.. ఆటగాళ్లపైనే కాదు కోచింగ్ సిబ్బందిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో తొలి వన్డే జరుగుతుండగానే అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్చేట్ రాజీనామా వార్త వెలుగులోకి వచ్చింది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. తనను సహాయక కోచ్ బాధ్యతల నుంచి తప్పించాలని అతడు హెడ్‌కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐని కోరాడు. డస్చేట్ కుటుంబం లండన్‌లో నివసిస్తోంది. అతడికి ముగ్గురు పిల్లలు. ఉద్యోగం చేస్తూ పిల్లలను చూసుకోవడం అతడి భార్యకు కష్టంగా మారింది. దాంతో, పిల్లలతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతో డస్చేట్ కోచింగ్ పదవిని వదులుకునేందుకు సిద్ధమయ్యాడు. టీమిండియా మ్యాచ్‌ల కోసం.. తరచూ ప్రయాణాలు చేయాల్సి రావడంతో.. ఇకపై లండన్‌లోనే ఉంటూ కోచింగ్ కెరీర్ కొనసాగించాలని అనుకుంటున్నాడు. పైగా బీసీసీఐతో అతడి కాంట్రాక్టు కూడా ముగిసింది. అయితే.. అటు గౌతీగానీ, ఇటు భారత బోర్డుగానీ డస్చేట్ గురించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ.. డస్చేట్ కోరినట్టే వెళ్లేందుకు అంగీకరిస్తే.. ఇంగ్లండ్‌తో మూడుల వన్డే సిరీస్‌తో భారత అసిస్టెంట్ కోచ్‌గా అతడి ప్రస్థానం ముగియనుంది. నెదర్లాండ్స్ మాజీ ఆటగాడైన డస్చేట్ రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయక కోచ్‌గా చేరాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ కోచింగ్ సిబ్బందిలో ఒకటైన అతడిని గౌతం గంభీర్ తన బృందలో చేర్చుకున్నాడు.

## క్రికెటర్ అభిషేక్ శర్మకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట..!


టీమిండియా యువ క్రికెటర్ అభిషేక్ శర్మ కు ఢిల్లీ హైకోర్టు లో భారీ ఊరట లభించింది. సోషల్ మీడియా లో ఈ-కామర్స్ సైట్ల లో తన అనుమతి లేకుండా పేరును, ఫొటోలను వాడుకుంటూ కొందరు చేస్తున్న వ్యాపారాలకు, అసభ్యకర ప్రచారాలకు కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జ్యోతి సింగ్.. కీలక ఆదేశాలు జారీచేశారు. అతని అనుమతి లేకుండా పేరు, ముఖచిత్రం, లేదా పర్సనాలిటీ రైట్స్‌ను కమర్షియల్ ప్రయోజనాల కోసం గానీ, సొంత ప్రచారం కోసం గానీ వాడకూడదని థర్డ్ పార్టీలపై కోర్టు నిషేధం విధించింది. అంతేకాదు ఇలాంటి అభ్యంతరకర లింకులను వెంటనే తొలగించాలంటూ మెటా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌తోపాటు ఈ-కామర్స్ వెబ్‌సైట్లను ఆదేశించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వాడుకుని కొందరు అభిషేక్ శర్మకు సంబంధించిన నకిలీ ఫొటోలు, వీడియోలను సృష్టిస్తున్నారు. దీనిని సవాల్ చేస్తూ అభిషేక్ శర్మ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తాజా విచారణలో ఇది అతని గౌరవానికి,



బ్రాండ్ వాల్యూకు నష్టం కలిగించేలా ఉన్నాయని అభిషేక్ తరఫు పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. కొంతమంది వెబ్‌సైట్లలో అతని మార్ఫింగ్ ఫొటోలపై అసభ్యకరమైన కామెంట్లు పెడుతున్నారని ఆరోపించారు. అతని అనుమతి లేకుండా అతని పేరు, ఫొటోలతో టీ-షర్టులు, బట్టలు తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ జ్యోతి సింగ్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సృష్టించే ఇలాంటి నకిలీ కంటెంట్‌ను వ్యాప్తి చేయడం, అలాగే అతని పేరుతో అక్రమంగా దుస్తులు, వస్తువులు అమ్మడంపై నిషేధం విధించారు. అభిషేక్ శర్మ ప్రస్తుతం భారత జాతీయ జట్టులో కీలక ఆటగాడని, అంతర్జాతీయ క్రికెట్లో ఎదుగుతున్న ఒక ప్రభావవంతమైన వ్యక్తిగా గౌరవించాలని కోర్టు కోరింది. ఒక వ్యక్తికి పర్సనాలిటీ రైట్స్ (వ్యక్తిత్వ హక్కులు) ఉన్నప్పుడు, వారి అనుమతి లేకుండా వారి గుర్తింపును దుర్వినియోగం చేయకుండా రక్షణ పొందే హక్కు సదరు వ్యక్తికి ఖచ్చితంగా ఉంటుందని స్పష్టంచేశారు.

# రాకా'లో మరో హీరోయిన్ ఫిక్స్..

## అల్లు అర్జున్ సినిమాపై అంచనాలు పెంచిన నైలా గ్రేవల్ !




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్-వరల్డ్ చిత్రం 'రాకా' పై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ సినిమాలో ఒకరికి మించి పలువురు హీరోయిన్లు కనిపించనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా సాగుతోంది. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి.ఇటీవల మలయాళ నటి ఫెమినా జార్జ్ తాను కూడా 'రాకా'లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు మరో కొత్త పేరు ఈ ప్రాజెక్ట్‌లో చేరింది. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నైలా గ్రేవల్, "దర్శకుడు అట్లీతో పని చేయాలని చాలా కాలంగా కోరుకుంటున్నాను. ఇప్పుడు ఆ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. బాలీవుడ్‌లో మాత్రమే పనిచేసిన నన్ను ఇలాంటి భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'రాకా'లో భాగమవడం నా కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయి" అని చెప్పింది. నైలా గ్రేవల్ ఇప్పటికే 'తమాషా', 'బరేలీ కి బర్ఫీ', 'తప్పడ్', 'ఇష్క్ విశ్క్ రీబౌండ్' వంటి హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. అలాగే ఓ ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్‌లోనూ మెప్పించింది. ఇప్పుడు అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. 'రాకా'లో పలువురు నటీనటులు భాగమవుతున్న నేపథ్యంలో సినిమా కథ, పాత్రలపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. అట్లీ తన మార్క్ కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సైన్స్ ఫిక్షన్ టచ్ జోడిస్తూ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, మిగిలిన నటీనటులు, కథకు సంబంధించిన వివరాలను మేకర్స్ దశలవారీగా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సొంతం చేసుకుంటోంది.



## దివ్య భారతి గ్లామర్ షో

# 'లెనిన్'జోరు ..


## నాలుగు రోజుల్లో ఎంత వసూలు చేసింది అంటే..!




ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటి నుంచి అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. నాలుగో రోజు కలెక్షన్లలో మాత్రం సహజమైన డ్రాప్‌ను నమోదు చేసింది. అయినప్పటికీ మొత్తం వసూళ్ల పరంగా దూసుకెళ్తూ అఖిల్ కెరీర్‌లోనే అతిపెద్ద కమర్షియల్ హిట్‌గా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అఖిల్ పవర్‌ఫుల్ యాక్షన్, భాగ్యశ్రీ బోర్సే నటన, ఎస్. థమన్ అందించిన సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మాస్ సెంటర్లలో సినిమాకు మంచి ఆదరణ లభిస్తుండటంతో విడుదలైన తొలి రోజు నుంచే కలెక్షన్ల పరంగా దూసుకుపోతోంది.మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.16.7 కోట్ల గ్రాస్ వసూలు చేసి అఖిల్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ నమోదు చేసిన ఈ చిత్రం, వీకెండ్ ముగిసే సమయానికి మూడు రోజుల్లో రూ.61.1 కోట్ల గ్రాస్ సాధించి సంచలనం సృష్టించింది. ఈ జోరుతో డిస్ట్రిబ్యూటర్ల పెట్టుబడులు కూడా వేగంగా రికవరీ అవుతున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్ తర్వాత వచ్చే సోమవారం దాదాపు అన్ని సినిమాల కలెక్షన్లు తగ్గడం సాధారణమే. అదే పరిస్థితి 'లెనిన్'కు కూడా ఎదురైంది. అడ్వాన్స్ బుకింగ్స్ పరంగా మంచి స్పందన కనిపించినప్పటికీ, నాలుగో రోజు ప్రపంచవ్యాప్తంగా సినిమా రూ.6.1 కోట్ల గ్రాస్ మాత్రమే రాబట్టింది.వీశీజఅవం దీంతో నాలుగు రోజుల ముగింపుకు ఈ చిత్రం మొత్తం రూ.67.2 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో, కేవలం నాలుగు రోజుల్లో రూ.67.2 కోట్ల గ్రాస్‌తో బ్లాక్‌బస్టర్ ప్రయాణం కొనసాగుతోంది అంటూ మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ సినిమాలు లేకపోవడం 'లెనిన్'కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. మరోవైపు పాజిటివ్ మౌత్ టాక్ కూడా సినిమాకు బలంగా నిలుస్తోంది. అయితే వీకెండ్‌తో పోలిస్తే సోమవారం కలెక్షన్లు గణనీయంగా తగ్గడం ట్రేడ్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇక రాబోయే రోజుల్లో వసూళ్లు నిలకడగా కొనసాగితే రూ.100 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ క్లబ్ చేరడం పెద్ద కష్టమేమీ కాదని, లేదంటే ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# 'తుంబాడ్ 2' లోకి ఆలియా భట్.. క్రేజీ అప్‌డేట్‌తో సోషల్ మీడియా షేక్!



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్' (ఏబఎఎమ్బఎ). ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది" అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్దిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపిందిఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## రామ్ చరణ్-సుకుమార్

# సినిమాలో నయనతార..

## పవర్‌ఫుల్ పాత్రలో లేడీ సూపర్ స్టార్?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న RC17' చిత్రంపై అంచనాలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్‌గా ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే ఇప్పటివరకు ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనే విషయంపై మేకర్స్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ తరుణంలో ఈ సినిమా కాస్టింగ్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన ప్రచారం జోరందుకుంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ చిత్రంలో భాగం కానున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో బలంగా టాక్ వినిపిస్తోంది. అయితే ఆమె ఈ సినిమాలో కథానాయికగా కాకుండా, కథను మలుపు తిప్పే ఒక కీలకమైన, ఎంతో ప్రాధాన్యత కలిగిన పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.సాధారణంగా దర్శకుడు సుకుమార్ రాసుకునే ప్రతి పాత్రకు ఒక బలమైన గుర్తింపు, ప్రాముఖ్యత ఉంటాయి. 'రంగస్థలం' చిత్రంలో ప్రతి క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేసిన సుకుమార్.. RC17'లో కూడా నయనతార కోసం ఒక పవర్‌ఫుల్ రోల్‌ను సిద్ధం చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, నయన్ రాకతో ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం. మరోవైపు, తెలంగాణ నేపథ్యంలో సాగే పక్కా రూటెడ్ నేటివిటీ స్టోరీగా ఈ సినిమా తెరకెక్కనుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో నయనతార పాత్రపై వస్తున్న వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియాలంటే చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# నాగచైతన్య కొత్త సినిమా?



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. 'బెదురులంక 2012' చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే 'మసూద' దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా 'మసూద'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com